# షోపీస్

"ఎవరో అమ్మాయి బెర్నార్డ్‌షా దగ్గరకు వచ్చి మనిద్దరం పెళ్లి చేసుకుంటే నా అందమూ, నీ తెలివి తేటలూ ఉన్న పిల్లలు పుడతారు" అందట.

దానికి బెర్నార్డ్‌షా "నా అందం, నీ తెలివితేటలు ఉన్న వాళ్లు పుడితేనో" అన్నాడట. మన విషయంలో ఆ ప్రశ్న వర్తించదు" అంది డాక్టర్ విజయ.

డాక్టర్ వసంత్ తల ఊపేడు. నిజమే తామిద్దరూ ఎమ్.డి. చేశారు. నగరంలో మంచి డాక్టర్లుగా ఇద్దరికీ పేరుంది. ఇద్దరూ అందమున్న వాళ్లకిందే లెక్క.

నెలలు నిండుతూన్న భార్యను చూస్తూ పుట్టబోయే బిడ్డ గురించి కలల్లోకి తేలిపోయాడు వసంత్. విజయ అప్పటికే స్వప్నావస్థలో ఉంది.

వారి కలలను నిజం చేస్తూ పుట్టినవారి కొడుకు ముద్దుగా ఉన్నాడు. పుట్టినప్పడే తొమ్మిది పౌనులున్న కొడుకుని చూసి గర్వంతో ఆనందంతో పొంగి పోయారిద్దరూ.

❖ ❖ ❖

"వినోద్, ఇలారా ఆంటీకి నమస్తే చెప్పు" అంది విజయ. రెండేళ్ల వినోద్ రెండు చేతులూ జోడించాడు.

ఆంటీ 'చాలా హెల్తీగా ఉన్నాడు మీ బాబు' అంది.

'రైమ్స్ కూడా చెప్తాడు'.

వినోద్ "ట్వికిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్. హౌ అయ్‌వండర్ వాట్ యూ ఆర్. అఫ్ అబొవ్ ది వరల్డ్ సో హై లైక్ ఎ డైమండ్ ఇన్‌ద స్కై", అని పాడుతూ ఆక్షన్ చేసి చూపించాడు.

"చాలా బ్రిలియంట్ మీ బాయ్. రెండేళ్లకే ఎంత బాగా చెప్తున్నాడో, మీరు చాలా అదృష్టవంతులు" అంది వచ్చినావిడ.

డాక్టర్ విజయ మురిసిపోయింది.

❖ ❖ ❖

నర్సింగ్ హోంలోని నర్సులూ, అటెండర్లూ డాక్టరు గారి అబ్బాయిని ముద్దాడు తున్నారు. డాక్టర్ వసంత్ బాబుని లోపలికి తీసుకురమ్మన్నాడు. తనతో ఉన్న ఫ్రెండుకి వినోద్‌ని చూపిస్తూ "మా వాడు నా ఇన్‌స్ట్రుమెంట్స్‌ని అన్నీ గుర్తుపడతాడు తెలుసా!" అన్నాడు.

అతని పరువు పోకుండా వినోద్ స్టెతస్కోపు, థర్మామీటర్, బి.పి. ఇన్‌స్ట్రుమెంట్ వంటివన్నీ గుర్తుగా చూపించాడు.

"యూ ఆర్ వెరీ లక్కీ. మీ ఇద్దర్నీ మించిన డాక్టరయ్యేలా ఉన్నాడు మీ అబ్బాయి" అన్నాడు వసంత్ ఫ్రెండ్.

❖ ❖ ❖

వినోద్ చదువు తల్లిదండ్రుల ఆశలకి అనుగుణంగానే సాగింది. చదువులో, ఆటలలో, డిబేట్స్‌లో అన్నిటా ఫస్ట్ ఉండేవాడు. డ్రాయింగ్‌రూంలో అతనికి ప్రైజులుగా వచ్చిన బుక్స్, మెడల్స్ ప్రైజులందుకున్నప్పటి ఫోటోలు పెట్టడానికి స్పెషల్‌గా షోకేసు కట్టించారు.

ఇంటికి వచ్చిన అతిథులందరికి ప్రత్యేకంగా వినోద్‌ని ఇంట్రడ్యూస్ చేసేవారు తల్లీ తండ్రీ.

"మా అబ్బాయి వినోద్ వెరీ బ్రిలియంట్. అన్నిటిలోనూ ఫస్టుమార్కే. వియ్ ఆర్ వెరీ ప్రౌడ్ ఆఫ్ హిమ్, ఎప్పటికీ ఇలాగే మాకు గర్వకారణంగా ఉంటాడని మా నమ్మకం."

వినోద్‌కి ఒక్కటే ధ్యేయం. ఎప్పుడూ అన్నిటిలోనూ ఫస్టురావాలి. తల్లితండ్రులకి తను గర్వకారణం కావాలి. అందరూ మెచ్చుకునేలా మెడిసన్‌లో చేరాడు.

చదువు సాఫీగా సాగిపోయిందికొన్నాళ్లు. నాలుగో సంవత్సరంలో ఉండగా అశనిపాతంలా వచ్చింది ఒక సంఘటన. అంతవరకూ అన్ని సబ్జెక్టులలో యూనివర్సిటీ ఫస్టు వచ్చి గోల్డ్‌మెడల్స్ సంపాదించాడు. నాలుగో ఏడాది ఒక సబ్జెక్టులో ఫస్ట్ రాలేదు.

అతనికి గుండె ఆగినంత పనయింది. ఇక తల్లి తండ్రులకి మొహం ఎలా చూపించడం? ఇన్నాళ్లూ తన గురించి ఎంతో గొప్పగా చెప్పకుంటున్నారే. ఇప్పుడు ఏమని చెప్పకుంటారు? మా అబ్బాయికి ఒక సబ్జెక్టులో ఫస్ట్ తప్పి పోయిందంటారా? ఇన్నాళ్లూ వాళ్ల కలలు నిజం చేస్తూ వచ్చిన తను ఈ వేళ వాళ్ల ఆశయాలకు తగినంతగా ఎదగలేకపోయాడు. ఏం చెయ్యాలిప్పుడు? అతనికి ఒక్కటే మార్గం కన్పించింది.

చదువు పూర్తిచేసి వైద్యుడిగా ఎందరికో ప్రాణాలు పోయాల్సినవాడు తన ప్రాణాలు తనే తీసుకున్నాడు.

పిల్లలంటే డ్రాయింగ్ రూములో ఎక్సిబిట్ చేసే షో పీసులు కారు. వారిలో సుగుణాలూ ఉంటాయి. లోపాలూ ఉంటాయి. పిల్లల విజయాలకి ఆనందించడం వేరు. ఆ విజయాలను ప్రదర్శించడమే జీవిత ధ్యేయం కావడం వేరు. నర్సరీ రైమ్స్ దగ్గరనుంచి యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ దాకా ఎక్సిబిషన్ పనికిరాదని తల్లితండ్రులకి తెలిస్తే వినోద్ జీవితం ఇంకోలా ఉండేది కాదా?

(ఆంధ్రప్రభ వీక్లీ)